
సాక్షి
ఒడిశా
శుక్రవారం । 25 । అక్టోబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.1,25,724లు వచ్చాయని అధికారులు తెలిపారు.



క్షణక్షణం భయం భయం

దానా దగ్గరకొస్తున్న కొద్దీ భయపెడుతోంది. గాలులు వేగం పుంజుకుంటున్నాయి.

- IIలో



తరలింపు సురక్షితం

దానా నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలిస్తున్నారు. ప్రక్రియ సజావుగా సాగుతోంది.

- IIలో

దూసుకొస్తున్న దానా



వర్చువల్ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్లు



సమీక్ష నిర్వహిస్తున్న సీఎం మోహన్ చరణ్ మాఝీ

- పలుచోట్ల ఎడతెరిపి లేకుండా వర్షం
- సురక్షిత ప్రాంతాలకు ప్రజల తరలింపు
- సీఎం మోహన్ చరణ్ సమీక్ష

భువనేశ్వర్:

దానా తుఫాన్ దూసుకొస్తోంది. తుఫాన్ తీవ్రత అత్యధికంగా ఉంటుందనే సంకేతాలు బలపడుతున్నాయి. ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా చాలా ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. తీరం దాటేందుకు ముందుగా ప్రభావిత ప్రాంతాల నుంచి ప్రజలు, పాడి పశువులు, గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యల్లో సమగ్ర యంత్రాంగం తలమునకలై ఉంది. 2 వారాల లోపు ప్రసవం అవకాశం ఉన్న గర్భిణులను ఆస్పత్రులు, ఆరోగ్య సేవా కేంద్రాలకు తరలించారు.

సమీక్ష సమావేశం

దానా తుఫాన్ సన్నద్ధతపై సీఎం మోహన్ చరణ్ మాఝి శుక్రవారం సమీక్షించారు. రాష్ట్రంలో ప్రభావిత జిల్లాల కలెక్టర్లు వీడియో కాన్ఫరెన్సులో పాల్గొని క్షేత్రస్థాయిలో స్థితిగతులను వివరించారు. 1,653 గ్రామాల నుంచి 3,62,000 మందిని ఆశ్రయ కేంద్రాలకు తరలించి భద్రత కల్పించారు. శుక్రవారం అర్ధరాత్రి ప్రాంతంలో తుఫాన్ తీరం తాకే అవకాశం ఉంది. దీంతో 11 కోస్తా జిల్లాలు ప్రభావితం అవుతాయని భావిస్తున్నారు. ఈ జిల్లాల్లో 38 మండలాలు, 9 పట్టణాలు, 1653 గ్రామాలు ఉన్నాయని సమీక్ష సమావేశంలో అధికార యంత్రాంగం వివరించింది. 2,338 మంది గర్భిణులను వైద్య కేంద్రాలకు తరలించారు. ఆరోగ్య సేవల నిమిత్తం 92 వైద్య బృందాలు, 58 పశు సంవర్ధక బృందాలను ప్రభావిత జిల్లాలకు తరలించారు.

రంగంలో సహాయక బృందాలు

19 జాతీయ విపత్తు స్పందన దళాలు, 51 ఒడిశా విపత్తు స్పందన దళాలు, 220 అగ్నిమాపక దళాలు, 158 ప్లాటూన్ల పోలీసు బలగాలను రంగంలోకి దింపారు. ఆశ్రయ కేంద్రాలకు ప్రజలను తరలించడంతో గ్రామాల్లో ఖాళీ అయిన ఇండ్ల రక్షణ కోసం ప్రత్యేక పోలీసు పహరా వ్యవస్థ పని చేస్తున్నట్లు అధికారులు వివరించారు. రాత్రింబవళ్లు ఈ వ్యవస్థ పని చేస్తుందన్నారు.

ఆస్పత్రులకు నిరంతర విద్యుత్

గాలుల తీవ్రతతో ఎక్కడికక్కడ చెట్లు విరిగిపడి విద్యుత్ స్తంభాలు కుప్ప కూలే పరిస్థితుల్లోనూ విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ఆస్పత్రుల్లో జనరేటర్ వ్యవస్థని పటిష్టపరిచారు. ప్రభావిత ప్రాంతాల్లో తాజా స్థితిగతులకు అనుగుణంగా స్థానికులకు చేయూతగా ప్రజా ప్రతినిధులు చురుకుగా పాలుపంచుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. చేయిదాటిన విపత్కర పరిస్థితుల్లో తెలియజేస్తే ప్రభుత్వం ఉన్నత స్థాయి చర్యలు చేపట్టేందుకు తక్షణమే స్పందిస్తుందని ముఖ్యమంత్రి అభయం ఇచ్చారు. ఆశ్రయ కేంద్రాల్లో ప్రజలు నిర్భయంగా ఉండాలని అభయం ఇచ్చారు.



ఒడ్రాఫ్ దళాల పర్యవేక్షణలో గర్భిణుల తరలింపు

గర్భిణులు సురక్షితం

భువనేశ్వర్: దానా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో గర్భిణులను సమీపంలోని ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రులకు తరలించి సంరక్షించారు. 14 జిల్లాలపై తుఫాన్ తీవ్రత ఉన్న నేపథ్యంలో గురువారం సాయంత్రం నాటికి 2,338 మంది గర్భిణులకు సంరక్షణ శిబిరాలకు తరలించారు. తుఫాన్ అలజడి సమయంలో తొలి ప్రసవం నమోదైంది. కటక్ జిల్లా నియాలి ప్రాంతంలో గర్భిణి సాయి స్వప్న బెహెరా మగ బిడ్డని ప్రసవించింది. నియాలి ప్రభుత్వ ఆస్పత్రి వర్గాల ప్రత్యక్ష పర్యవేక్షణలో తల్లీ బిడ్డలు ఇరువురు క్షేమంగా ఉన్నట్లు సిబ్బంది తెలిపారు.



ప్రసూతి వార్డులో గర్భిణులకు సంరక్షణ



వైద్య వర్గాల పర్యవేక్షణలో మగ శిశువుతో బాలింత

న్యూస్‌రీల్

మంటల్లో లారీ దగ్ధం



మంటల్లో చిక్కుకున్న లారీ

రాయగడ: నడుస్తున్న ఒక లారీలో మంటలు చెలరేగడంతో దగ్ధమయ్యింది. జిల్లాలోని బిసంకటక్ సమితి పరిధి బృందావడి గ్రామ సమీపంలో బుధవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బందికి తెలియజేశారు. దీంతో వారు వచ్చి సుమారు అరగంట సమయం శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. జేకేపూర్‌లోని జేకే పేపర్ మిల్‌లో పేపర్ లోడింగ్‌తో రాయిపూర్ వైపు వెళ్తున్న లారీలో బృందావడి చేరేసరికి ఒక్కసారిగా లారీ నుంచి మంటలు వచ్చాయి. దీనిని గమనించిన డ్రైవర్ వెంటనే కిందకి దిగిపోయాడు. లారీలో షార్ట్ సర్క్యూట్ వలన ప్రమాదం సంభవించినట్లు అగ్నిమాపక సిబ్బంది భావిస్తున్నారు.

చేతి వృత్తులతో ఆర్థికాభివృద్ధి



ఎస్‌హెచ్‌జీ మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ పట్వారీ

రాయగడ: మహిళా సంఘాల సభ్యులు చేతి వృత్తులను నేర్చుకుంటే ఆర్థికాభివృద్ధి సాధించవచ్చునని కలెక్టర్ ఫరూల్ పట్వారీ అన్నారు. జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితిలో బుధవారం ఆమె పర్యటించారు. దీనిలో భాగంగా పలు విద్యాలయాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొచరా, మేదరి వీధుల్లో ఎస్‌హెచ్‌జీ మహిళా బృందాలు వెదురుతో రూపొందించిన కళాఖండాలను, వివిధ ఆకృతులను చూసి ముగ్ధులయ్యారు. ఇటువంటి చేతి వృత్తి పనుల ద్వారా ఆర్థిక, సామాజిక ప్రగతి సాధించవచ్చన్నారు. అవసరయ్యే వనరులను జిల్లా యంత్రాంగం సమకూర్చి ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఎంతో ఆకర్షణీయంగా వెదురుతో తయారు చేసే కళాకృతులకు మంచి గిరాకీ ఏర్పడేవిధంగా మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేందుకు సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.


అన్నప్రసాద వితరణ



అన్న ప్రసాదానికి విచ్చేసిన భక్తులు

పర్లాకిమిడి: స్థానిక గాంధీ జంక్షన్‌లోని గజలక్ష్మీ పూజా పెండాల్ వద్ద గురువారం అన్నప్రసాద కార్యక్రమం జరిగింది. గజలక్ష్మీ అన్నదాన ప్రసాద కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేశారు. పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి కూడా గజలక్ష్మీ పెండాల్‌కు విచ్చేసి అమ్మవారి దీవెనలు అందుకున్నారు. పూజలు ఆదివారంతో ముగియనున్నాయి.


విమానాశ్రయాలకు బాంబు బెదిరింపు



విమానాశ్రయంలో మోహరించిన రక్షక దళం

భువనేశ్వర్: రాష్ట్రంలో రెండు విమానాశ్రయాల్లో బాంబు పుకారు కలకలం రేపింది. స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం, ఝార్సుగుడ వీర సురేంద్ర సాయి విమానాశ్రయాల్లో బాంబు ఉన్నట్లు సామాజిక మాధ్యమాల్లో దుమారం రేగింది. సమాచారం అందుకున్న పోలీసులు బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాల సహకారంతో గాలింపు చేపట్టారు. విమానాశ్రయాల్లో భద్రత కట్టుదిట్టం చేశారు. ఉగ్రవాదం అణిచివేత ప్రత్యేక దళాల్ని మోహరించారు.

వారపు సంతలో జూదం



సంతలో కొనసాగుతున్న జూదం, కోళ్ల పందాలు

మల్కనగిరి: జిల్లాలోని కలిమెల సమితి ఎంవీ–79 పోలీస్ స్టేషన్ పరిధిలో గల టిగాల్ గ్రామంలో వారపు సంతలో జూదం, కోళ్ల పందాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. దీనిపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎలాంటి సమాచారం లేదని ఇకపై సంతలో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెడతామని ఐఐసి సుభాష్ కర్కరా చెప్పారు.

జగన్నాథ రక్షమాం

భువనేశ్వర్: దానా పెను తుఫాన్ తాకిడి నేపథ్యంలో ప్రజానీకం తీవ్ర భయాందోళనలతో ఉంది. పూరీలోని శ్రీ మందిరం శిఖరాన నిత్యం పతిత పావన పతాకాన్ని నిత్యం మారుస్తారు. సాధారణంగా నీల చక్రం దగ్గర ఎరుపు, పసుపు పచ్చని పతాకాలు ఎగుర వేయడం ఆచారం. దానా విపత్కర పరిస్థితుల్లో సముద్రంలో ఆందోళనకర వాతావరణ పరిస్థితి శాంతింపజేసేందుకు గురువారం ధవళ వర్ణ పతిత పావన పతాకం ఎగుర వేశారు. తెలుపు రంగు శాంతికి ప్రతీక. ప్రకృతి వైపరీత్యం శాంతింపజేసేందుకు ప్రత్యేకంగా తెల్లని పతాకం ఎగుర వేసి దానా విపత్తు హానికరం కాకుండా తొలగిపోవాలని ప్రార్థించినట్లు పతిత పావన పతాకం సేవకులు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ ఆంజనేయుని దగ్గర తుఫాన్ తీవ్రత తొలగించాలని హారతి సమర్పించి ధవళ పతాకం ఎగుర వేశారు. నీల చక్రం దగ్గర పతిత పావన పతాకం అమర్చే సమయంలో ఒకటి, రెండు చిన్న పతాకాలు చేజారిపోయి కనుమరుగైన పరిస్థితి ఆశ్చర్యం కలిగించిందన్నారు.



శ్రీ మందిరం శిఖరాన ధవళ పతాకం

సెల్‌ఫోన్ దుకాణంలో చోరీ



సీసీ కెమెరా దృశ్యాలు

మల్కనగిరి: జిల్లాలోని చిత్రకొండ గ్రామంలో బుధవారం రాత్రి సంజయ్ దఫా అనే వ్యక్తికి చెందిన సెల్‌ఫోన్ దుకాణంలో చోరీ జరిగింది. దుండగులు దుకాణం పైకప్పు విరగ్గొట్టి లోపలకు జొరబడి విలువైన 10 సెల్‌ఫోన్‌లను దొంగిలించారు. ఎప్పటిలాగే సంజయ్ దుకాణాన్ని గురువారం ఉదయం తెరిచేందుకు వెళ్లి చూడగా సామాన్లు చిందరవందరగా పడి ఉండటం గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దుకాణంలో గల సీసీ కెమెరాలను పరిశీలించారు. దాని ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు ఐసీ ముకుంద మెలక తెలియజేశారు.

బంగాళాదుంపల మాటున బాణసంచా అక్రమ రవాణా



మందుగుండు సామాన్లతో నిందితుడు

మల్కనగిరి: బంగాళాదుంపల లోడ్‌లో బాణసంచా సామగ్రి అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు గురువారం పట్టుకున్నారు. బలిమెల–జయపూర్ ప్రధాన రహదారి వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు అటువైపుగా వస్తున్న ఒక వ్యాన్‌ను ఆపి తనిఖీ చేశారు. బంగాళాదుంపల మధ్యలో మందుగుండు సామగ్రి ఉన్నట్లు గుర్తించడంతో వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని డ్రైవర్ జురేంద్ర జెన్నాను అదుపులోకి తీసుకున్నారు.

ఇంజక్షన్ వికటించి బాలింత మృతి



పపడాహండి మార్గంలో మృతదేహంతో ఆందోళన చేస్తున్న గ్రామీణులు

కొరాపుట్: తప్పుడు ఇంజక్షన్ ఇవ్వడం వల్ల ఓ బాలింత ప్రాణం పోయింది. గురువారం నబరంగ్‌పూర్ జిల్లా పపడాహండి సమితి చర్చుట గ్రామ పంచాయతీ బట్టికోట్ గ్రామానికి చెందిన చవుకుమార్ శాంత భార్య తంబో శాంత (25)కు ఆశా కార్యకర్త ఇంజక్షన్ ఇచ్చింది. అయితే ఇవ్వాల్సిన ఇంజక్షన్ బదులు వేరే ఇంజక్షన్ ఇవ్వడంతో కొద్ది గంటల్లోనే ఆమె చనిపోయింది. అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు ఆశా కార్యకర్త ఇచ్చిన ఇంజక్షన్‌ను వైద్య నిపుణుడికి చూపించడంతో అది తప్పుడు ఇంజక్షన్ అని తెలిసింది. దీంతో వారు పపడాహండి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి రు.20 లక్షలు పరిహారం కావాలని డిమాండ్ చేశారు. మృతురాలికి ప్రసవమై మూడు నెలలు మాత్రమే అవుతోంది. అధికారులు చలించకపోవడంతో వారి కుటుంబ సభ్యులు పపడాహండి–ఉమ్మర్ కొట్ జాతీయ రహదారి మీద ఆందోళనకు దిగారు. మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి టైర్లు కాల్చి వాహనాలు నిలువరించారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.



రోడ్డుపై టైర్లు కాల్చి ఆందోళన

288 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి, కారును స్వాధీనం చేసుకున్న పోలీసులు

మల్కనగిరి: జిల్లాలోని మల్కనగిరి బలిమెల పోలీసులు కుడుములుగుమ్మ గ్రామ సమీపంలో భారీ ఎత్తున గంజాయి స్వాధీనం చేసుకున్నారు. బుధవారం రాత్రి తనిఖీలు నిర్వహిస్తుండగా నకమాముడి–గోవిందపల్లి రహదారిపై అతివేగంగా వస్తున్న కారును పోలీసులు ఆపే ప్రయత్నం చేశారు. డ్రైవర్ ఆపకపోవడంతో పోలీసులు వెంబడించారు. దీంతో కుడుములగుమ్మలోని పెట్రోల్ బంక్ వద్ద కారును ఆపి డ్రైవర్ పరారయ్యాడు. లోపల తనిఖీ చేయగా 288 కిలోల గంజాయి బయటపడింది. దీని విలువ సుమారు రూ.25 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్ విజేత స్టార్ లెవెన్



విజేతలకు ట్రోఫీ, నగదు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే, క్లబ్ సభ్యులు

జయపురం: ఈ నెల 11వ తేదీ నుంచి స్థానిక దసరా పొడియ మైదానంలో జయపురం ఈవినింగ్ క్లబ్ వారు నిర్వహించిన జేసీఎల్ చాంపియన్ క్రికెట్ పోటీలలో జయపురం స్టార్ 11 చాంపియన్‌గా నిలిచింది. గురువారం జరిగిన ఫైనల్‌లో నువాపడ టీమ్, జయపురం స్టార్ 11 టీమ్ తలపడ్డాయి. తొలిత బ్యాటింగ్ చేసిన స్టార్ 11 టీమ్ 15 ఓవర్లలో 188 పరుగులు చేసింది. 189 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన నువాపడ టీమ్ 183 పరుగులు చేసి ఆల్ అవుట్ అయింది. మేన్ ఆఫ్ ది మ్యాచ్, మేన్ ఆఫ్ దీ సిరీస్‌గా స్టార్ 11 టీమ్ ఆటగాడు ఎం.శ్రీనివాసరావు ఎంపికయ్యారు. బహుమతుల ప్రధాన ఉత్సవంలో జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చాంపియన్ టీమ్‌కు రూ.1,11,111 నగదు, ట్రోఫీ, రన్నర్‌గా నిలిచిన నువాపడ టీమ్‌కు రూ.77,777 నగదు, రన్నర్ ట్రోఫీ అందజేశారు. ఈ టోర్నమెంట్‌ను ఈవినింగ్ క్లబ్ సభ్యులు సమీర్, చందన, సత్యనారాయణ, సంతోష్, పింకు పర్యవేక్షించారు.

భద్రంగా ఉందాం



దానా తుఫాన్ నేపథ్యంలో పూరీసాగర తీరంలో సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ అద్భుత సైకత శిల్పం రూపొందించారు. భద్రంగా ఉంటే భయపడాల్సింది లేదనే సందేశంతో సైకత శిల్పం తీర్చిదిద్దాం.

- భువనేశ్వర్

క్లుప్తంగా

జయపురంలో నగర సంకీర్తన


నగర సంకీర్తనలు చేస్తున్న వీరబ్రహ్మేంద్ర స్వామి భక్త బృందం

జయపురం: కార్తీక మాసంలో హిందువులు, సిక్కులు, జైనులు కార్తీక పౌర్ణమిని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. కార్తీక మాసం ప్రారంభం నుంచి నగర సంకీర్తనలు చేస్తారు. నగర సంకీర్తనలతో జయపురం గురువారం మార్మోగింది. ఉదయం నాలుగు గంటల సమయంలో బెల్ రోడ్డులో గల వీరబ్రహ్మేంద్ర స్వామి మందిరం నుంచి భజనలు చేశారు. ఈ నెల 18వ తేదీ నుంచి తాము నగర సంకీర్తనలు చేస్తున్నట్లు వీరబ్రహ్మేంద్ర స్వామి భక్తులు తెలిపారు. కార్తీక మాసం ఆఖరు వరకు నగర సంకీర్తనలు చేస్తామన్నారు.

అవినీతిపై దర్యాప్తు చేయాలి

జయపురం: స్థానిక జగన్నాథ్ సాగర్ పునరుద్ధరణ పేరుతో జయపురం మున్సిపాలిటీ కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడిందని బీజేపీ నేత రవీంద్ర మహాపాత్రో ఆరోపించారు. గురువారం ఆయన జయపురంలోని విజిలెన్స్ అధికారిని కలిసి ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపై దర్యాప్తు చేయాలని కోరారు. గత రెండేళ్లలో హాల్ రూ.7 కోట్లు, మున్సిపాలిటీకి సంబంధించిన నిధులు రూ.3 కోట్లకు పైగా జగన్నాథ్ సాగర్ అభివృద్ధి పేరుతో చేపట్టిన పనుల్లో అవినీతి జరిగిందని ఆరోపించారు. కొద్దిరోజుల కిందట డీపీఆర్ రూ.15 కోట్లు మంజూరు చేసిందని, ప్రభుత్వ ఆదేశాలను తుంగలో తొక్కి మున్సిపాలిటీ చేయాల్సిన పునరుద్ధరణ పనులను టెండర్ పిలువకుండా ఎస్.హెచ్.జి గ్రూపులకు అప్పగించారని ఆరోపించారు. ఒడిశా హౌసింగ్ అండ్ అర్బన్ డవలప్‌మెంట్ విభాగ మంత్రికి, ప్రిన్సిపల్ కార్యదర్శికి, కొరాపుట్ కలెక్టర్, జయపురం సబ్‌కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారు.

చిత్రకొండలో కలెక్టర్ పర్యటన


కలెక్టర్‌కు సమస్యలు విన్నవించుకుంటున్న గ్రామస్తులు

మల్కనగిరి: కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్ జిల్లాలోని చిత్రకొండ సమితిలో గురువారం పర్యటించారు. వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సమితి పరిధిలో గల స్వాభిమాన్ ప్రాంతంలో గల అయిదు పంచాయతీలకు చెందిన ప్రజలు వివిధ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. విద్యుత్, సాగు, తాగునీరు వంటి మౌలిక సౌకర్యాలు లేక నానా అవస్థలు పడుతున్నామని వివరించారు. వారం రోజుల్లో సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని కలెక్టర్ గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

బంగారం మాయంపై సీఎంఓ ఆరా

శ్రీకాకుళం క్రైమ్ : రాష్ట్రవ్యాప్తంగా గతేడాది సంచలనం సృష్టించిన గార ఎస్బీఐ తనఖా బంగారం మాయం కేసు మరోసారి చర్చనీయాంశమైంది. సీఎంవో కార్యాలయం నుంచి కేసును ఆరా తీస్తూ అటు జిల్లా పోలీసులకు, ఇటు చనిపోయిన బ్యాంకు ఉద్యోగిని స్వప్నప్రియ కుటుంబాలకు సంక్షిప్త సందేశాలు, ఫోన్‌లు వచ్చాయి. ఈ కేసు విషయమై తమ కుటుంబాన్ని అన్యాయంగా ఇరికించారంటూ.. తన కుమార్తెను బలితీసుకున్నారంటూ ఇప్పటికే స్వప్నప్రియ తల్లి ఉరిటి సరళాదేవి జాతీయ మానవ హక్కులు, జాతీయ మహిళా కమిషన్లకు ఫిర్యాదు చేయడమే కాకుండా సీఎం చంద్రబాబు కు, హోంమంత్రి అనితకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఎంవో కార్యాలయం నుంచి స్వప్నప్రియ తల్లికి ఫోన్ వచ్చింది. విచారణ నిష్పక్షపాతంగా పోలీసు లు చేస్తున్నారా లేదా అన్నదానిపై వారు ఆరా తీసిన ట్లు తెలిసింది. కేసును పర్యవేక్షిస్తున్న అధికారులకు సైతం కేసు పురోగతి గురించి ఆరా తీసినట్లు సమాచారం. ఇప్పటికే ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఈ కేసు ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడం, పైఅధికారుల నుంచి కూడా త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాల ని ఆదేశాలు రావడంతో టౌన్ డీఎస్పీ సిహెచ్ వివే కానందతో విచారణను వేగవంతం చేయించారు. కేసులో కీలకమని భావిస్తూ ఆరోపణలు ఎదుర్కొంటున్న.. ప్రస్తుతం పోలీసులు అనుమానిస్తున్న అప్ప టి జిల్లా ఎస్బీఐ రీజనల్ మేనేజర్ టి.ఆర్.ఎం.రాజును ఇప్పటికే మూడు నాలుగు సార్లు సబ్‌డివిజన్ కార్యాలయానికి పిలిపించి ఆరా తీశారు.

ఐటీఐల్లో మిగులు సీట్లకు కౌన్సెలింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలో మూడు ప్రభుత్వ, 20 ప్రైవేట్ ఐటీఐల్లో మిగులు సీట్లకు ఐదో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా ప్రవేశాల కన్వీనర్ ఎల్.సుధాకర్‌రావు గురువారం తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈ నెల 26లోపు ఐటీఐ.ఏపీ.జీవీవో.ఐఎన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అనంతరం సమీప ప్రభుత్వ ఐటీఐకి వెళ్లి వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. 28న ప్రభుత్వ ఐటీఐల్లో, 30న ప్రైవేట్ ఐటీఐల్లో ఉదయం 9 గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు.

తరలింపు సురక్షితం


చిన్నారిని ఆశ్రయ శిబిరానికి తరలిస్తున్న రక్షణ అధికారి


వృద్ధ మహిళను తీసుకెళ్తున్న ఆశా కార్యకర్త


పోలీసుల చేయూతతో ఆశ్రయ స్థలం చేరుతున్న వృద్ధుడు


దివ్యాంగ మహిళ తరలింపు

తుఫాన్ నిర్వహణలో భాగంగా ప్రమాదకర ప్రాంతాల్లో ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు ముందస్తుగా తరలించడానికి విపత్తు నిర్వహణ యంత్రాంగం రాత్రింబవళ్లు నిర్విరామంగా శ్రమిస్తోంది. కేంద్రాపడా, జగత్‌సింగ్‌పూర్, కటక్, పూరీ తదితర జిల్లాల్లో ఈ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి.

– భువనేశ్వర్

గోశాల నిర్మాణానికి శంకుస్థాపన


గోశాలకు శంఖుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

జయపురం: స్థానిక మునిసిపాలిటీ తలపెట్టిన గోశాలకు జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి శంకుస్థాపన చేశారు. జయపురం సమితి బలియ గ్రామ పంచాయతీ సునానగర్ ప్రాంతంలోని మునిసిపాలిటీలో గల 2 ఎకరాల 90 సెంట్లలో శిలాన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ సరస్వతీ మరియు జ్యోతి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బాహిణీపతి మాట్లాడుతూ.. పట్టణంలో విచ్చలవిడిగా సంచరిస్తూ ట్రాఫిక్‌కు అవరోధం కల్పించటంతోపాటు ప్రజలకు ఇబ్బంది కల్పిస్తున్న పశువులను నియంత్రించేందుకు గోశాల నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఖుర్ధా జిల్లాలో గోశాలను సందర్శించి ఆ తరహాలో గోశాల నిర్మాణం చేపట్టాలన్న నిర్ణయం తీసుకున్నామన్నారు. పశువులకు వసతి, వైద్య సౌకర్యం, ఆహారం సమకూర్చేందుకు నిధుల కోసం ప్రభుత్వాన్ని కోరటం జరిగిందన్నారు. మునిసిపాలిటీ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్ మాట్లాడుతూ గోశాల నిర్మాణానికి రూ.2.48 కోట్లు డీపీఆర్ విభాగం మంజూరు చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం రూ.1.05 కోట్లు మంజూరు చేసిందన్నారు. గోశాలలో 100 పశువులు ఉంచేందుకు, వైద్య సౌకర్యం కోసం డాక్టర్ చాంబర్, ఆపరేషన్ గది, తదితర సౌకర్యాలతోనూ, గోబర్ గ్యాస్ ప్లాంట్ ఏర్పాటు జరుగుతుందని వెల్లడించారు. మునిసిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, వైస్ చైర్‌పర్సన్ బి.సునీత, అదనపు కార్యనిర్వాహక అధికారి కృతిబాస్ సాహు, తహసీల్దార్ సవ్యసాచి జెన, మునిసిపల్ ఇంజనీర్ అజయ కుమార్ జానీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై ఉన్నత స్థాయి సమావేశం


జిల్లా స్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్


రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

పర్లాకిమిడి: జిల్లా స్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశం స్థానిక కలెక్టరేట్‌లో పాలనాధికారి బిజయకుమార్ దాస్ అధ్యక్షతన గురువారం ఉదయం జరిగింది. జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశాల్లో పట్టణంలో ప్రజల్లో చైతన్యం ఎలా తీసుకురావాలన్న విషయంపై పలువురు అధికారులతో కలెక్టర్ చర్చించారు. వాహనాల తనిఖీలు, మద్యం సేవించిన వాహనదారులపై తగు చర్యలు తీసుకోవాలని, లైసెన్సు లేని వాహనదారులపై జరిమానా విధించాలని కలెక్టర్ రోడ్డు రవాణా అధికారులకు, పోలీసులకు ఆదేశించారు. జాతీయ రహదారి చంద్రగిరి వద్ద ఎప్పుడూ అంబులెన్స్ ఉంచాలని కలెక్టర్ సూచించారు. సమావేశానికి ఎస్పీ జితేంద్రనాథ్ పండా, సబ్ డివిజనల్ పోలీసు అధికారి మాధవానంద నాయక్, ఆర్ అండ్ బీ సూపరింటెండింగ్ ఇంజనీరు శ్రీకాంత సామల్, ఆర్టీ.ఓ. ప్రసన్న కుమార్ దాస్, ఎంవీఐ తుషార్ హెంబ్రం తదితరులు పాల్గొన్నారు.

తెలుగు వెలుగు రత్న అవార్డులకు ఆహ్వానం

శ్రీకాకుళం కల్చరల్: దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ, విశాఖరత్న కళా పరిషత్ నిర్వహణలో నవంబరు 16న విశాఖలో జాతీ య తెలుగు వెలుగు రత్న అవార్డులు ప్రదానం చేయనున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు, కళాభూషణ్ పి.ఎ.భాస్కరరావు ఒక ప్రకటలో తెలిపా రు. సంగీతం, కూచిపూడి, భరతనాట్యం, సాహిత్యం, గానం, జానపదం, నాటకరంగం, క్రీడా రంగం, ఆధ్యాత్మికం, వైద్యం, సమాజ సేవకులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధు లు అర్హులని పేర్కొన్నారు. వివరాలు, పత్రిక ల్లో ప్రచురితమైన కథనాలను నవంబర్ 5లో గా 9848481767 నంబర్‌కు పంపించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

● అరుణ గగనం


తుఫాన్ నేపథ్యంలో ఆకాశం రంగులు మార్చుకుంటోంది. బుధవారం చీకటి పడుతున్న సమయంలో భువనేశ్వర్ పరిసర ప్రాంతాల్లో మేఘాలన్నీ కలిసి ఇలా గాఢమైన వర్ణంతో మెరిసిపోయాయి.

- భువనేశ్వర్

తుఫాన్‌పై ప్రధాని ఆరా

భువనేశ్వర్: రాష్ట్రంలో దానా తుఫాన్ విపత్తు నిర్వహణ కార్యాచరణ పురస్కరించుకుని భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝితో ఫోనులో సంభాషించారు. ప్రజల రక్షణ, భద్రత కోసం అవసరమైన సహాయం కేంద్రం నుంచి సకాలంలో లభిస్తుందని ప్రధాని అభయం ఇచ్చినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. దానా తుపాను విపత్తు నిర్వహణ ఏర్పాట్లపై భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంతృప్తి వ్యక్తం చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

ఆటో అదుపు తప్పి పది మందికి గాయాలు


గాయపడిన మహిళకు చికిత్స అందిస్తున్న సిబ్బంది

కాశీబుగ్గ: పలాస మండలం కంబిరిగాం జాతీయ రహదారి కూడలిపై ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో పది మంది మహిళా కూలీలు, డ్రైవర్ గాయాల పాలయ్యారు. పెద్దనారాయణపు రం నుంచి కాశీబుగ్గకు ఆటోలో వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న 1033 నేషనల్ హైవే అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని బాధిత మహిళలకు ప్రాథమిక చికిత్స అందించి అనంతరం పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో చేర్పించారు. తీవ్రంగా గాయపడిన చింతల పార్వతిని మెరుగైన వైద్యం నిమిత్తం శ్రీకాకుళం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేశారు.

గడ్డిమందు తాగి వివాహిత ఆత్మహత్య

నందిగాం: మండలంలోని నౌగాంకు చెందిన కొన్ని సావిత్రి (35) గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొన్ని తవుడు భార్య సావిత్రి కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో మనస్థాపం చెంది బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డిమందు తాగింది. కొద్దిసేపటి తర్వాత గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పి ంచగా.. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. సావిత్రికి ఒక కుమారు డు ఉన్నాడు. మృతురాలి సోదరుడు ముఖలింగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్సై షేక్ మహమ్మద్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుతో మహిళ మృతి


కోనారి జయలక్ష్మి(ఫైల్)

నందిగాం: మండలంలోని శివరాంపురం పంచాయతీ కోటిపల్లికు చెందిన కోనారి జయలక్ష్మి(24) పాము కాటు తో మృతి చెందింది. పోలీ సులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోనారి సోమేశ్వరరావుకు జయలక్ష్మితో ఆరేళ్ల క్రితం వివా హం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు కార్తీక్(5), హరీస్(3) ఉన్నారు. ఈ నెల 21న రాత్రి భోజనం చేశాక ఇంట్లో పడుకున్నారు. రాత్రి 11 గంటల సమయంలో జయలక్ష్మికి కట్లపాము కాటు వేయడంతో మెలకువ వచ్చి భర్తకు చెప్పింది. వెంటనే బైక్‌పై టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్క డ ప్రథమచికిత్స చేసిన అనంతరం మెరుగైన చికి త్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. పోస్టుమార్టం అనంతరం స్వగ్రామానికి మృతదే హం తరలించారు. నందిగాం ఏఎస్సై వరలక్ష్మీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవినీతి ఆరోపణలు నిరూపించాలి

● మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి సవాల్


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి

జయపురం: జయపురంలో చారిత్రాత్మక జగన్నాథ్ సాగర పునర్‌నిర్మాణ పనులలో ఎటువంటి అవినీతి, అక్రమాలు జరగలేదని మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి స్పష్టం చేశారు. గురువారం మున్సిపాలిటీ సభాగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సాగర్ పునురుద్ధరణ పనులలో అవినీతి జరుగుతుందన్న ఆరోపణలను ఖండించారు. ఆరోపణలపై సీఐడీ, సీబీఐతో విచారణకు తాము సిద్ధమన్నారు. తాము పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. గతంలో ఎవరూ జగన్నాథ్ సాగర్ పురుద్ధరణకు ముందుకు రాలేదని, ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, మున్సిపాలిటీ అధికారులు నడుంబిగించారన్నారు. గత ప్రభుత్వం ముందు డిమాండ్ చేయగా, ప్రధాన పాలన కార్యదర్శి, టి-కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు స్పందించి సాగర్ పరిస్థితి సమీక్షించేందుకు టెక్నికల్ టీమ్‌ను పంపారని వెల్లడించారు. అనంతరం రూ.14 కోట్ల 84 లక్షల డీపీఆర్‌ను రూపొందించగా దానిని ప్రభుత్వం ఆమోదించిందనిన్నారు. ఇంతవరకు ఆ మొత్తం రాలేదన్నారు. జగన్నాథ్ సాగర్‌లో జరిగిన అభివృద్ధి పనులను వివరించారు.

క్షణ క్షణం భయం భయం


ఎగసి పడుతున్న కెరటాలు

భువనేశ్వర్: దానా తుఫాన్ ఏ క్షణంలో తీరం దాటి ఏ అలజడి రేపుతుందోననే భయం సర్వత్రా అలముకుంది. గురువారం రాత్రి 9 గంటలు సరికి పారాదీప్‌కు ఆగ్నేయ దిశలో 100 కిలో మీటర్ల దూరంలో ఉంది. ధామ్రా, భిత్తర్‌కనికా ప్రాంతాల్లో తీరం దాటే ప్రమాదం ముంచుకు వస్తుంది. గంటకు 13 కిలోమీటర్ల వేగంతో తుఫాన్ నిలకడగా తీరం వైపు కదులుతోంది. ఈ నెల 24, 25 తేదీల్లో గాలులు బలం పుంజుకుని వీస్తాయి. తీరం తాకే సమయంలో గాలుల వేగం గంటకు 100 నుంచి 110 కిలో మీటర్లు ఉంటుందని అంచనా. ప్రధానంగా 4 జిల్లాల్లో గాలుల వేగం గంటకు 100 నుంచి 110 కిలో మీటర్లు ఉంటుంది. ఈ జాబితాలో జగత్‌సింగ్‌పూర్, బాలాసోర్, కేంద్రాపడా, భద్రక్ జిల్లాలు ఉన్నాయి. మయూర్‌భంజ్ జిల్లాలో గాలుల వేగం గంటకు 80 నుంచి 90 కిలో మీటర్లు, పూరీ, కటక్, జాజ్‌పూర్, ఖుర్దా, భువనేశ్వర్, ఢెంకనాల్ మరియు కెంజొహార్ 7 జిల్లాల్లో గాలుల వేగం గంటకు 60 నుంచి 70 కిలో మీటర్లు ఉంటుంది. సుందరగడ్ జిల్లాలో గంటకు 50 కిలో మీటర్లు, అంగుల్, గంజాం, బౌధ్, నయాగడ్, సంబలపూర్, దేవ్‌గడ్ జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో వీస్తాయని వాతావరణ వర్గాల సమాచారం.

అలజడి

బంగాళా ఖాతంలో వాతావరణం అలజడి విపరీతమై తీరంలో కెరటాలు ఎగసి పడతాయి. కేంద్రాపడా, భద్రక్, బాలాసోర్ 3 జిల్లాల్లో సముద్ర తీరంలో కెరటాలు 1 నుంచి 2 మీటర్ల ఎత్తున ఎగసి పడతాయి. జగత్‌సింగ్‌పూర్ జిల్లాలో 1 మీటరు ఎత్తున కెరటాలు ఎగసి పడే సంకేతం జారీ అయింది.

ఒడ్రాఫ్ సిద్ధం


సహాయ, పునరుద్ధరణ కార్యకలాపాలకు సిద్ధమైన ఒడ్రాఫ్ యంత్రాంగం

భువనేశ్వర్: ఆపత్కాలంలో అక్కరకు వచ్చే ఆపద్బాంధవుల ఆగమనం ఆరంభమైంది. అత్యంత బలమైన గాలుల తాకిడితో ఊగిసలాడే 9 జిల్లాలకు రెడ్ అలర్టు జారీ అయింది. తుఫాన్ ధామ్రా, భిత్తర్‌కనికా ప్రాంతాల్లో స్థల భాగం తాకుతుందని భావిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో మయూర్‌భంజ్, ఢెంకనాల్, అంగుల్ జిల్లాలకు దానా తుఫాన్ మలుపు తిరిగే సంకేతాలు బలపడుతున్నాయి. రాష్ట్రంలో దానా తుపాను విజృంభణ అంచనా ప్రాంతాలకు సహాయక, పునరుద్ధరణ బృందాలు పూర్తి స్థాయి సరంజామాతో చేరుకున్నాయి. 19 యూనిట్ల ఎన్‌డీఆర్‌ఎఫ్, 51 యూనిట్ల ఒడ్రాఫ్ దళాలు పలు ప్రాంతాలకు చేరుకున్నాయి.

వంట సామగ్రి చోరీ


తెరిచి ఉన్న తలుపులు

నరసన్నపేట: నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. మధ్యాహ్న భోజన వంటగదిలోకి చొరబడి గ్యాస్ సిలిండర్, అల్యూమినియం వంట పాత్రలు, రూ.15 వేలు విలువైన కిరాణా వస్తువులు చోరీ చేసినట్లు వంట నిర్వాహకురాలు రాధ తెలిపారు. ఈ మేరకు నరసన్నపేట పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసినట్లు హెచ్‌ఎం వెంకటరావు తెలిపారు.

రెచ్చిపోయిన పిచ్చికుక్కలు: 53 మందికి గాయాలు

- సీహెచ్‌సీకి పరుగు తీసిన క్షతగాత్రులు
- యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అందజేసిన వైద్యులు


కుక్క కాటుతో తీవ్ర గాయాల పాలైన బాధితులు


క్షతగాత్రులను సీహెచ్‌సీలో దగ్గరుండి చేర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం తదితరులు

చీపురుపల్లి: పట్టణంలో పిచ్చి కుక్కలు గురువారం స్వైర విహారం చేశాయి. కనిపించిన వారిని కనిపించినట్లే ఇష్టా రాజ్యంగా కరుస్తూ వెళ్లాయి. ఈ మేరకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో పిచ్చి కుక్కలు కరవగా 53 మంది ఒకేసారి గాయాలపాలవడంతో ప్రజలు భయాందోళన చెందారు. పిచ్చి కుక్కల దాడిలో తీవ్రంగా గాయాలపాలైన వారంతా పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రా(సీహెచ్‌సీ)నికి చికిత్స పొందేందుకు పరుగులు తీశారు. గాయాలపాలై సీహెచ్‌సీకి వచ్చిన వారికి యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌తో వైద్యులు చికిత్స అందించారు. అయితే ఒకేసారి 53 మంది కుక్క కాటు గాయాలతో సీహెచ్‌సీకి రావడంతో తగినంత వ్యాక్సిన్ అందుబాటులో లేకపోవడంతో పరిసర ప్రాంతాల్లో ఉన్న పీహెచ్‌సీల నుంచి వ్యాక్సిన్లు తెప్పించి క్షతగాత్రులకు అందజేశారు. కుక్క కాటుతో తీవ్ర గాయాలవడంతో దాదాపు ఎనిమిది మందిని సీహెచ్‌సీలో పరిశీలనలో ఉంచామని వారిని కూడా త్వరలో డిశ్చార్జ్ చేయనున్నట్లు సీహెచ్‌సీ సూపరెండెంట్ డా.శ్రీధర్ తెలిపారు.

స్పందించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

ఇదిలా ఉండగా పట్టణంలో సుడిగాలిలా తిరుగుతూ పిచ్చి కుక్కలు స్వైర విహారం చేసిన ఘటనలో 53 మంది క్షతగాత్రులు సీహెచ్‌సీలో చేరారు. ఆ సమయానికి సరిపడా వ్యాక్సిన్ సీహెచ్‌సీలో అందుబాటులో లేదు. దీంతో ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణలు మండలంలోని కర్లాం పీహెచ్‌సీ వైద్యులతో మాట్లాడి అత్యవసరంగా వ్యాక్సిన్‌లు తెప్పించారు.

నెలాఖరులోగా మద్యం షాపు ఎత్తివేత



మద్యం షాపు వద్ద మహిళలు, స్థానికులతో మాట్లాడుతున్న సీఐ చిన్నం నాయుడు

- ఎక్సైజ్ సీఐ చిన్నంనాయుడు

బొబ్బిలి: పట్టణంలోని మేదరబంద వద్ద ఉన్న ప్రైవేట్ మద్యం దుకాణానికి ప్రభుత్వం తాత్కాలిక లైసెన్స్ ఇచ్చిందని, ఈనెలాఖరుతో అది ముగిసిన వెంటనే ఇక్కడి షాపును ఎత్తివేసి వేరే చోటకు తరలిస్తామని ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు తెలిపారు. మేదరిబంద వద్ద మద్యం షాపు ఏర్పాటుపై స్థానిక మహిళలు నిరసన వ్యక్తం చేస్తున్న అంశంపై గురువారం సాక్షి దినపత్రికలో 'వద్దు బాబూ..,వద్దు ' శీర్శికన వార్త ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన సీఐ చిన్నం నాయుడు ఆ ప్రాంతానికి వెళ్లి మహిళలు, స్థానిక నాయకులతో మాట్లాడారు. ఈనెల 16న టెండర్ ప్రాతిపదికన మద్యం షాపు ఏర్పాటు చేయడంతో నిబంధనల ప్రకారం మద్యం అమ్మకాలు ప్రారంభించినట్లు చెప్పారు. అయితే స్థానిక మహిళలు నిరసన చేపట్టడంతో ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, ఈ లోగా షాపు అద్దెకు ఇచ్చిన భవన యజమాని కూడా అగ్రిమెంటు వెనక్కు తీసుకుంటానని చెప్పడంతో కొత్త షాపు కోసం వెతుకుతున్నామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం షాపు దొరకగానే మద్యం షాపును తరలిస్తామని స్పష్టం చేశారు. మహిళలపై తాగుబోతుల చేష్టలు గానీ, అఘాయిత్యాలు కానీ సహించబోమని, వారి రక్షణ కూడా మా బాధ్యత అని సీఐ చిన్నం నాయుడు తెలిపారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, కింతలి బంగార్రాజు, స్థానిక మహిళలు కార్యక్రమంలో ఉన్నారు.

డీఈఓగా మాణిక్యాలనాయుడు

- డీఆర్వోగా శ్రీనివాసమూర్తి



విజయనగరం అర్బన్: జిల్లా విద్యాశాఖ అధికారిగా భీమునిపట్నం డైట్ కాలేజీలో సీనియర్ అధ్యాపకునిగా పనిచేస్తున్న యు.మాణిక్యాలనాయుడు నియామకమయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఎం.ప్రేమకుమార్‌కు విశాఖపట్నం డీఈఓగా బదిలీ అయింది. నూతన డీఈఓ మాణిక్యాలనాయుడు స్కూల్ అసిస్టెంట్, డైట్ కళాశాల అధ్యాపకునిగా జిల్లాలో పనిచేసిన అనుభవం ఉంది. అలాగే, జిల్లా రెవెన్యూ అధికారిగా ఎస్.శ్రీనివాస్‌మూర్తిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేసిన ఎస్.డి.అనితను జీఏడీలో నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. శ్రీనివాసమూర్తి సింహాచలం ఏఓగా, విజయనగరం ఆర్డీఓగా గతంలో పనిచేశారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తం

- అవగాహనతోనే అడ్డుకోవాలి
- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి


విలేకరులతో మాట్లాడుతున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి, చిత్రంలో ఎస్పీ వకుల్ జిందాల్

బొబ్బిలి: అమాయకుల భయాందోళనలు, అనుబంధాలను ఆసరాగా చేసుకుని చేస్తున్న సైబర్ నేరాలు ఇటీవల ఎక్కువగా జరుగుతున్నాయని, వాటి పట్ల ప్రజల్లో చైతన్యం, అవగాహన కల్పించే చర్యలు పోలీస్ శాఖ తీసుకుంటోందని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు.సైబర్ నేరాలు నానాటికీ పెరిగిపోతున్నాయని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీస్‌స్టేషన్లలో వార్షిక తనిఖీలకు వచ్చిన ఆయన గురువారం బొబ్బిలి పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. గతంలో ఎస్ఎంఎస్, ఈమెయిల్‌ల లింకులతోను, ఓటీపీ చెప్పాలంటూ మోసం చేసే ముఠాలు బ్యాంకు ఖతాల్లో డబ్బును కొల్లగొట్టేవారన్నారు. ఇప్పుడు నేరుగా పోలీసులమని, సీఐడీ, ఈడీ, సీబీఐ వంటి సంస్థల్లో పనిచేస్తున్న పెద్దహోదాగల వ్యక్తులమని, మీ కుమారుడు, కుటుంబసభ్యులు పోలీసుల అదుపులో ఉన్నారంటూ, విడిపించాలంటే పెద్ద మొత్తంలో ముట్టజెప్పాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారన్నారు. కోర్టులు, పోలీస్‌స్టేషన్ సెట్టింగులతో సులువుగా మోసం చేసి కోట్లరూపాయలు కొల్లగొడుతున్నారన్నారు. ఇటీవల బొబ్బిలిలోనే ఈ తరహా మోసం చేసే ప్రయత్నం జరగ్గా బాధితుడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తెలియజేస్తామనడంతో పెద్ద సైబర్ నేరం తప్పిందన్నారు. ఇటువంటి సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు సమాచారం ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఓ పథకం ప్రకారం డబ్బున్న వారిని టార్గెట్ చేస్తున్నారని అనుమానం వస్తే వెంటనే సైబర్ క్రైమ్‌కు కానీ, టోల్ ఫ్రీ నంబర్‌కు కానీ సమాచారం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో ఏఎస్పీ సౌమ్యలత, డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు సతీష్‌కుమార్, నారాయణరావులు పాల్గొన్నారు.


బలిజిపేట: పోలీస్‌స్టేషన్‌లో రివ్యూ నిర్వహిస్తున్న డీఐజీ

మహిళా పోలీసుల పాత్ర కీలకం

బొబ్బిలి రూరల్: నేరాల నియంత్రణకు గ్రామాలు, వార్డుల్లోని సచివాలయాల మహిళా సంరక్షణ కార్యదర్శుల (మహిళాపోలీసులు) పాత్ర కీలమైనదని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో మహిళా సంరక్షణ కార్యదర్శులతో గురువారం ఆయన సమావేశమయ్యారు.ఈ సందర్భంగా నేరాల అదుపుకోసం వారు చేస్తున్న కార్యక్రమాలపై ఆరా తీశారు. గ్రామాలు, వార్డుల్లో గంజాయి, డ్రగ్స్, మద్యం తాగే వారి పట్ల కఠినంగా ఉండాలని ఆదేశించారు. చెడు వ్యసనాలకు బానిసయ్యేవారి కుటుంబసభ్యులు, సంబంధిత వ్యక్తులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని, వారిలో మార్పు రాకపోతే పోలీస్ స్టేషన్‌లో వివరాలను అందజేయాలని సూచించారు. అలాగే చెడు వ్యసనాలతో జరిగే అనర్థాలపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతి గ్రామం, వార్డుల్లో ఉన్న ప్రజలను మీరు నిశితంగా పరిశీలించేందుకు అవకాశం ఉంటుందని, నేరాలకు పాల్పడేవారి వివరాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు అందజేయాలని వివరించారు. అనంతరం కొత్తగా నిర్మించిన షటిల్ కోర్టును ప్రారంభించి మొక్కను నాటారు.ఈ సమావేశంలో ఎస్పీ వకుల్‌జిందాల్, ఏఎస్పీ సౌమ్యలత, డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు సతీష్‌కుమార్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా రక్షణపై దృష్టిసారించాలి


బొబ్బిలి రూరల్: మహిళా సంరక్షణ కార్యదర్శులతో మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి

బలిజిపేట: మహిళా రక్షణకు ప్రాధాన్యం ఇచ్చి వారిని పరిరక్షించాలని డీఐజీ గోపీనాథ్ జెట్టి తెలిపారు. ఈ మేరకు బలిజిపేట పోలీస్‌స్టేషన్‌ను ఆయన గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. మహిళలపై ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఎస్సై సింహాచలానికి సూచించారు. మహిళల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. మహిళా పోలీసుల సహకారంతో సైబర్ క్రైమ్, గొలుసు దుకాణాల నివారణ, సారా తయారీ, విక్రయాలు వంటివాటిని నిర్మూలించాలని ఆదేశించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి సంతృప్తి వెలిబుచ్చారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్పీ మాధవరెడ్డి, ఏఎస్పీ అంకిత సురనా మహావీర్, సీఐ గోవిందరావు, ఎస్సై సింహాచలం, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు 40 మంది ఎంపిక


రాష్ట్ర పోటీలకు ఎంపికైన జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్టు క్రీడాకారులు

శృంగవరపుకోట: రాష్ట్రస్థాయిలో జరగనున్న బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా నుంచి 40 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. జిల్లా ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్-14, 17 విభాగాలకు బాల్ బాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక పోటీలు గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో ఎంపికైన 130మంది వేర్వేరు పాఠశాలలకు చెందిన క్రీడాకారులు ఈ ఎంపికలకు హాజరు కాగా వారిలో మెరుగైన ఆటతీరు ఆధారంగా 20మంది బాలికలు, 20 మంది బాలురను సెలక్షన్ కమిటీ సభ్యులు ఎంపిక చేసినట్టు పీఈటీ జి.లక్ష్మణరావు చెప్పారు. ఎంపికైన వీరు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయిలో ఎస్‌జీఎఫ్ నిర్వహించనున్న బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు



పీడీలతో సమీక్ష నిర్వహిస్తున్న భీమాశంకర్

కొత్తవలస: స్కూల్‌గేమ్స్‌లో భాగంగా అండర్-19 విభాగంలో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలను మండల కేంద్రంలో గల భారత్ డిఫెన్స్ అకాడమీలో శుక్రవారం ప్రారంభించనున్నట్లు జిల్లా వృత్తివిద్యా అధికారి ఎస్.భీమాశంకర్ తెలిపారు.ఈ మేరకు పోటీల నిర్వహణ తీరుపై నియోజకవర్గం పరిధిలో గల పీడీలతో భారత్ డిఫెన్స్ అకాడమీ ఆవరణలో గురువారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పోటీలకు ఆంధ్రాలో గల ఉమ్మడి 13 జిల్లాల క్రీడాకారులు హాజరవుతారని తెలిపారు. వారందరికీ భోజనం, వసతి సౌకర్యం భారత్ డిఫెన్స్ అకాడమీ వారు సమకూరుస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్రం తరఫున నవంబర్‌లో జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో భారత్ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ కె.రాజు, స్కూల్‌గేమ్స్ ఆర్గనైజింగ్ వైస్ ప్రెసిడెంట్ ఎం.ఆదినారాయణ, పలువురు పీడీలు పాల్గొన్నారు.

రెండు ట్రావెల్స్ బస్సులు దగ్ధం


మంటలను అదుపులోకి తీసుకువస్తున్న అగ్నిమాపక సిబ్బంది

విజయనగరం క్రైమ్: విజయలక్ష్మి ట్రావెల్స్‌కు చెందిన రెండు బస్సులు అగ్నికి ఆహుతయ్యాయి. మరొకటి పాక్షికంగా దెబ్బతింది. దీనికి సంబంధించి జిల్లా అగ్నిమాపక శాఖ సహాయ అధికారి వి. సోమేశ్వరరావు గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక రాజీవ్ స్టేడియం ఎదురుగా రోడ్డు పక్కన కోరాడ గురునాయుడికి చెందిన విజయలక్ష్మి ట్రావెల్స్ బస్సులు నిలుపుదల చేస్తారు. అయితే గురువారం వేకువజామున 5 గంటల తరువాత ఒక్కసారిగా పెద్దశబ్దం రావడంతో పరిసర ప్రాంతంలో ఉండే నివాసితులు బయటకు వచ్చిచూడగా బస్సుల్లోంచి మంటలు చెలరేగాయి. వెంటనే పక్కనే ఉన్న అగ్నిమాపక కార్యాలయానికి పరుగెత్తుకుని వెళ్లి సమాచారాన్ని అందించారు. దీంతో రెండు వాహనాల్లో అగ్నిమాపక అధికారులు అక్కడికి చేరుకుని గంటన్నర వ్యవధిలో మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు. అగ్నికీలల ధాటికి పైన ఉన్న విద్యుత్ వైర్లు, పరిసర ప్రాంతాల్లో ఉన్న టీవీలు, ఫ్రిడ్జ్‌లు పాడయ్యాయి. సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో షార్టు సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించిందని అధికారులు అంచనాకు వచ్చారు.వేలాడే విద్యుత్ వైర్లను పక్కకు తొలగించి నివేదికలను ఫైర్ అధికారులకు అందించారు. సుమారు రూ.పది లక్షల మేర ఆస్తినష్టం జరిగి ఉంటుందని అధికారులు అంచనా వేశారు. జిల్లా ఫైర్ అధికారి బీవీఎస్ రామ్‌ప్రసాద్, ఎల్ఎస్‌వోలు సంతోష్, నాగరాజు, ఫైర్‌మెన్ ఆదినారాయణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు స్థల సేకరణ



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: జిల్లాలోని ప్రతి శాసనసభ నియోజకవర్గంలో ఒక ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేసేందుకు ఆలోచన చేస్తున్నట్లు, ఇందుకోసం అవసరమైన ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఉదయం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెవెన్యూ శాఖలోని పలు అంశాలపై సబ్ కలెక్టర్లు, తహసీల్దార్లు, సర్వేయర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు సమస్యలు లేకుండా చేయడమే పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) లక్ష్యమని తెలిపారు. సర్వీసెస్ ఫిర్యాదులను కూడా రెవెన్యూ ఫిర్యాదుల కిందకే చూపుతున్నారని, ఇకపై ఆ రెండింటిని వేరుగా చూపాలని పేర్కొన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన సమస్యలకు సరైన, నాణ్యమైన పరిష్కారం ఇవ్వని కారణంగా, ఫిర్యాదులు మళ్లీ రీ ఓపెన్ అవుతున్నాయని, ఇకపై పునరావృతం కారాదని ఆదేశించారు. భవిష్యత్తులో ఏర్పాటుకాబోయే ఇండస్ట్రియల్ పార్క్, గృహ నిర్మాణాల కోసం అనువుగా ఉండే ప్రాంతాలను ఇప్పటి నుంచే గుర్తించి సిద్ధం చేసుకోవాలని సూచించారు. పాచిపెంటలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ప్రాంతాలను గుర్తించడం ద్వారా భవిష్యత్తులో మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఉంటుందని, తద్వారా ఆర్థిక పురోగతి లభించగలదని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే ప్రస్తుతం నిర్మిత మవుతున్న గృహాలతోపాటు రానున్న రోజుల్లో కూడా మరిన్ని గృహ నిర్మాణాలకు స్థలం అవసరం అవుతుందని పేర్కొన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్‌లు అశుతోశ్ శ్రీ వాస్తవ, యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవ నాయుడు, తహసీల్దార్లు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎంవీజీఆర్‌లో తైక్వాండో జట్టు ఎంపిక


ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న తైక్వాండో జట్టు ఎంపిక పోటీలు


పోటీలో పాల్గొన్న క్రీడాకారులతో పరిశీలకులు,అతిథులు

డెంకాడ: విజయనగరం జిల్లా తరఫున పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన తైక్వాండో జిల్లా జట్టు ఎంపిక ప్రక్రియ చింతలవలసలోని ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం జరిగింది. జేఎన్‌టీయూజీవీ అనుబంధ కళాశాలల నుంచి పలువురు విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పురుషులు, మహిళా విభాగాల వారీగా జట్లకు ఎంపిక పోటీలు జరగ్గా పోటీలను ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.రమేష్ ప్రారంభించారు. యూనివర్సిటీ పరిశీకులుగా రఘు ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ జీసీఎస్ రాజు, తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ వేణుగోపాల రావు, విశాఖ జిల్లా అసోసియేషన్ సభ్యుడు వీఎన్‌డీ ప్రవీణ్ తదితరులు వ్యవహరించారు. జేఎన్‌టీయూజీవీ తరఫున బలమైన తైక్వాండో జట్టు ఎంపిక పోటీలు హోరాహోరీగా సాగాయి. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ డి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ జట్ల పయనం


ఫుట్‌బాల్ పోటీలకు వెళ్తున్న జిల్లా జట్టు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్టు గురువారం పయనమయ్యాయి. ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు అనంతపురం జిల్లా హిందుపూర్‌లో జరగనున్న అండర్-14 బాల, బాలికల పోటీల్లో జిల్లా నుంచి 36 మంది క్రీడాకారులు పాల్గొనున్నారు. వారంతా విజయనగరం రైల్వే స్టేషన్ నుంచి గురువారం బయల్దేరారు. ఈ సందర్భంగా జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కేవీ.కృష్ణంరాజు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లైంగికదాడికి పాల్పడిన నిందితుడి అరెస్టు

బొబ్బిలి: పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం జర్న గ్రామానికి చెందిన ఓ గిరిజన బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందిత యువకుడిని పోలీసులు గురువారం అరెస్ట్ చేసి పోక్సో కేసు నమోదు చేశారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. కురుపాం ఏకలవ్య పాఠశాలలో చదువుతున్న బాధిత బాలిక దసరా సెలవుల అనంతరం ఫీజు సంబంధమైన డబ్బుల కోసం అదే మండలానికి చెందిన కిల్లక మోహన రావు అనే యువకుడి వద్దకు వెళ్లింది. బొబ్బిలిలోని మల్లంపేటలో రూమ్ తీసుకుని చదువుతున్న మోహన రావు రేపు డబ్బులు ఇస్తానని చెప్పి ఈనెల 21న ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాధిత బాలిక కుటుంబ సభ్యులు, బంధువులకు తెలియజేసింది. దీంతో బాలికకు మేనమామ వరుసయ్యే వ్యక్తి ఈ ఘటనపై పార్వతీపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పార్వతీపురం పోలీసులు ఆన్‌లైన్‌లో ఈ ఫిర్యాదును, జీరో ఎఫ్ఐఆర్‌ను తీసుకుని దర్యాప్తు చేసి నిందిత యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు బొబ్బిలి సీఐ కె.సతీష్‌కుమార్ విలేకరులకు తెలిపారు.

అండర్-14 వాలీబాల్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక


అండర్-14 జిల్లా వాలీబాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో ఫెడరేషన్ ప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న వాలీబాల్ పోటీల్లో పాల్గొనబోయే అండర్-14 స్కూల్‌గేమ్స్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు గురువారం ఉల్లాస భరిత వాతావరణంలో సాగాయి. జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా కేంద్రంలోని రాజీవ్ క్రీడామైదానంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో విజయనగరం, పార్వతీపురం-మన్యం జిల్లాలకు చెందిన 200 మంది క్రీడాకారులు పోటీపడ్డారు. ఉదయం నుంచి ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 12 మంది బాలికలు, 12 మంది బాలురుకు జిల్లా జట్టులో స్థానం కల్పించారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 9,10,11 తేదీల్లో విజయనగరం జిల్లా భోగాపురంలో జరగనున్న అంతర్ జిల్లాల అండర్-14 బాల, బాలికల వాలీబాల్ పోటీల్లో జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్లు జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కేవీ.కృష్ణంరాజు తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు క్రీడాదుస్తులను ఫెడరేషన్ తరఫున అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంపిక పోటీలను రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి టీవీ.భగవాన్ దాస్, జిల్లా కార్యదర్శి కేవీఎస్ రాజు, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి


శంకరరావు(ఫైల్)

మక్కువ: మండలంలోని చెముడు గ్రామంలో గురువారం విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతిచెందాడు. దీనిపై పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన కోట శంకరరావు (49) విద్యుత్ సంబంధిత మరమ్మతు పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంటికి విద్యుత్ సరఫరా లేకపోవడంతో, శంకరరావు విద్యుత్ స్తంభం పైకెక్కి వైర్లు సరి చేస్తుండగా ఇన్వర్టర్ వైర్‌లో విద్యుత్ ప్రవహించడంతో విద్యుత్ షాక్‌కు గురై, అదుపుతప్పి స్తంభం పై నుంచి కింద పడిపోవడంతో తలకు తీవ్ర గాయమైంది. ఈ విషయం గుర్తించిన స్థానికులు మక్కువ పీహెచ్‌సీకి తరలించగా అక్కడ పరీక్షించిన అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని భార్య పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటరమణమూర్తి తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..

గజపతినగరం: మండలంలోని వేమలి గ్రామానికి చెందిన పల్లి బంగారమ్మ విశాఖపట్నం కింగ్ జార్జ్ ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతూ గురువారం మృతి చెందింది. ఈనెల 22వన పల్లి బంగారమ్మ, భర్త పైడిరాజు తమ గొర్రెలను మేపేందుకు గ్రామ సమీపంలో ఉన్న చెరువు వద్దకు వెళ్లారు. అక్కడ బంగారమ్మను పాము కాటు వేయడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మణ రావు చెప్పారు.

ఆరుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

గజపతినగరం: మండల కేంద్రంలో గల మల్ల పు చెరువు గట్టుపై పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని బుధవారం రాత్రి అరెస్ట్ చేసినట్లు ఎస్సై కె.లక్ష్మణరావు గురువారం తెలిపారు. పేకాట, కోడిపందాలు తదితర వాటిలో పాల్గొన్నా, ప్రోత్సహించినా అటువంటి వాటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు. పట్టుబడిన పేకాట రాయుళ్ల దగ్గర నుంచి రూ.5వేల545 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

టీచర్ ఓటు హక్కుకు దరఖాస్తుల స్వీకరణ

- వచ్చేనెల ఆరో తేదీ వరకు అవకాశం

విజయనగరం అర్బన్: శాసనమండలి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ స్థానానికి జరగబోయే ఎన్నికల్లో ఓటుహక్కు పొందేందుకు నవంబర్ 6వ తేదీలోగా ఉపాధ్యాయులందరూ దరఖాస్తు చేసుకోవాలని ఈఆర్వో, విశాఖ జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహనరావు తెలిపారు. దీనిపై అన్ని జిల్లాల్లో విస్తృత స్థాయిలో ఉపాధ్యాయులకు అవగాహన కల్పించామన్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన వివిధ శాఖల అధికారులతో విజయనగరం కలెక్టరేట్ సమావేశం మందిరంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటు హక్కు కోసం దరఖాస్తుల స్వీకరణ తుదిగడువు నవంబర్ 6వ తేదీ అని చెప్పారు. నవంబర్ 23న ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటిస్తామని, అభ్యంతరాల స్వీకరణ అనంతరం డిసెంబర్ 30న ఓటర్ల తుది జాబితాను వెల్లడిస్తామని తెలిపారు. సమావేశంలో విజయనగరం జిల్లా డీఆర్వో ఎస్డి అనిత, మన్యం జిల్లా డీఆర్వో జి.కేశవనాయుడు, జిల్లా ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ భాస్కరరావు, తహసీల్దార్లు, ఎంపీడీఓ ఎంఈవోలు, డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, విద్యాశాఖల అధికారులు పాల్గొన్నారు.

సారా స్వాధీనం

గరుగుబిల్లి: మండలంలోని కొంకడివరం రహదారి జంక్షన్ పరిధిలో బొలెరో వాహనం, మోటార్ సైకిల్‌పై అక్రమంగా తరలిస్తున్న సారాను స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్సై పి.రమేష్‌నాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సారాను ఈప్రాంతంలో విక్రయించేందుకు ఒడిశా నుంచి బొలెరో వాహనం, ద్విచక్రవాహనంపై తరలిస్తుండగా కొంకడివరం జంక్షన్‌లో బైక్‌పై 80 లీటర్ల సారాను తరలిస్తున్న బాలగుడబ గ్రామానికి చెందిన వై.కిశోర్, బి.కృష్ణలతో పాటు వంగర గ్రామానికి చెందిన కె.రమేష్ బొలెరోలో తరలిస్తున్న తొమ్మిది ప్లాస్టిక్ క్యాన్‌లలో 180 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే బొలెరో, మోటార్ సైకిల్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు. ఈమేరకు కేసు నమోదుచేసి రిమాండ్ నిమిత్తం పార్వతీపురం కోర్టుకు నిందితులను తరలించామన్నారు. ఈ దాడుల్లో హెచ్‌సీ ఎస్.ఈశ్వరరావు, సిబ్బంది రాము తదితరులు పాల్గొన్నారు.

మక్కువలో 20 లీటర్ల సారా..


స్వాధీనం చేసుకున్న సారా, నిందితులతో ఎస్సై రమేష్ నాయుడు

మక్కువ: మక్కువ, దుగ్గేరు జంక్షన్ వద్ద గురువారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా సారా పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒడిశాలోని బర్లబంద గ్రామానికి చెందిన కండ్రక.నరేష్ ద్విచక్ర వాహనంపై మక్కువ వస్తుండగా, వాహనాన్ని నిలుపుదల చేసి పరిశీలించగా, 20 లీటర్ల సారా బయటపడడంతో స్వాధీనం చేసుకున్నట్లు హెచ్‌సి.పైడయ్య తెలిపారు. నిందితుడి నుంచి ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం సాలూరు కోర్టుకు తరలించినట్లు హెచ్‌సీ చెప్పారు.

వేటకు వెళ్లరాదు

- మత్స్యశాఖ డీడీ నిర్మలాకుమారి

భోగాపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ప్రభావంతో రెండు రోజుల పాటు సంద్రంలో అలలు ఎగసిపడడంతో పాటు ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, మత్స్యకారులు చేపలవేటకు వెళ్లరాదని మత్స్యశాఖ డీడీ నిర్మలాకుమారి గురువారం సూచించారు. తీర ప్రాంతంలో గంటకు 100 నుంచి 110 కిలో మీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసిందన్నారు. తీరప్రాంత గ్రామాల్లో రెడ్ అలెర్ట్ ప్రకటించామని, తుఫాన్ సమాచారాన్ని ఎప్పటికప్పుడు మత్స్యకారులకు తెలియజేస్తామని చెప్పారు.

నర్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలిగా పద్మావతి


పద్మావతిని అభినందిస్తున్న సిబ్బంది

పార్వతీపురంటౌన్: ఉమ్మడి విజయనగరం జిల్లా గవర్నమెంట్ నర్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలిగా వి.పద్మావతి చంద్రసాయి ఎన్నికయ్యారు. పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తున్న ఆమెకు సూపరింటెండెంట్ బి.వాగ్దేవి, ఏపీ ఎన్జీఓ సంఘ అధ్యక్షుడు కిషోర్, నర్సింగ్ సూపరింటెండెంట్, వైద్యులు, హెడ్‌నర్సులు గురువారం అభినందనలు తెలిపారు.